

# అస్తమాతో.. జాగ్రత్త!

ఏటా పెరుగుతున్న వ్యాధిగ్రస్తులు

చలికాలంలో సమస్య తీవ్రం

చిన్నారులపై తీవ్ర ప్రభావం

దీర్ఘకాలికం గాకుండా జాగ్రత్తలు మేలు

**అస్తమా(ఉబ్బసం) వ్యాధి దీర్ఘకాలం పాటు విడువకుండా వేధించే క్రానిక్ డీసిజ్. ఈ సమస్యతో ఊపిరితిత్తులోకి ప్రాణవాయువును తీసుకువెళ్లే శ్వాసకోశ నాళాలు, లోపాల గోడలు ఉబ్బి పోతాయి. ఫలితంగా శ్వాస తీసుకోవడం కష్టంగా మారుతుంది. ప్రత్యేకించి పెద్దవారి కంటే ఈ వ్యాధి వల్ల పిల్లల్లోనే ముప్పు ఎక్కువ. ఎందుకంటే వారి శ్వాసకోశ నాళాలు చాలా చిన్నవిగా ఉంటాయి. అస్తమాతో చిన్నారులకు ఎక్కువగా ప్రాణాపాయం ఉంటుంది. మారుతున్న వాతావరణ పరిస్థితులు, కాలుష్యంతో రెండు దశాబ్దాలుగా అస్తమా వ్యాధిగ్రస్తుల సంఖ్య ఏడాదికేడాది పెరుగుతున్నది. ఈ పరిస్థితుల్లో తల్లిదండ్రులు చిన్నారులపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముంది. లేదంటే వ్యాధి తీవ్రత పెరిగి దీర్ఘకాలిక వ్యాధిగా సంక్రమించే అవకాశం ఉంది.**

– నేరేడుచర్ల, జనవరి 3

### ఆధునిక వైద్య విధానాలు



ప్రాథమిక స్థాయిలోనే అస్తమాను గుర్తిస్తే త్వరగా నయం చేయవచ్చు. వ్యాధి ముదిరితే దీర్ఘకాలిక చికిత్స అవసరం అవుతుంది. గతంలో ఈ వ్యాధి నివారణ కోసం ట్యాబ్లెట్లు, ఇంజక్షన్లు వాడేవారు. దీంతో కొన్ని దుష్పరిణామాలు చోటు చేసుకునేవి. చేతులు, కాళ్లు వణకడం, షుగర్, బీపీ వంటి సమస్యలు ఎదురయ్యేవి. ఇటీవల కాలంలో పీల్చే మందులు అందుబాటులోకి వచ్చాయి. వీటిని స్వల్ప, దీర్ఘకాలిక కోర్సులుగా వాడుతున్నారు.

పెరుగుతున్న పట్టణీకరణ, వాతావరణ కాలుష్యంతో అస్తమా బాధితులు ఎక్కువవ్వుతున్నారు. పరిశ్రమలు విస్తరించడం, వాహనాల కాలుష్యం మరో కారణం. నివాస గృహాలతో పాటు పరిసరాల పరిశుభ్రత లేకపోవడం, ఇంట్లో వాడే దిండ్లు, పరుపుల్లో పేరుకున్న దుమ్ము వల్ల అస్తమా బారినపడే ప్రమాదముంది. తడి గోడల వల్ల డస్ట్ మైట్స్ సూక్ష్మ క్రిములు చేరి వ్యాధి కారకాలుగా మారే అవకాశముంది. మరోవైపు పెరుగుతున్న పరిశ్రమల వల్ల భవిష్యత్‌లో అస్తమా వ్యాధిగ్రస్తులు పెరిగే అవకాశముందని వైద్యవర్గాలు హెచ్చరిస్తున్నాయి.

### అస్తమాకు చికిత్స

- అస్తమా వ్యాధిగ్రస్తులు ప్రాథమిక దశలోనే వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలి.
- ఊపిరితిత్తుల పరీక్షలు చేసి అస్తమాకు చికిత్సలు పొందవచ్చు.
- యోగా, వ్యాయామంతో అస్తమాను నియంత్రణలో ఉంచుకోవచ్చు.
- ప్రస్తుతం ఎన్నో రకాల మందులు వ్యాధి నియంత్రణకు అందుబాటులో ఉన్నాయి.

### వ్యాధి లక్షణాలు

- దగ్గు
- ఆయాసం, పిల్లి కూతలు
- రాత్రి వేళల్లో సరిగా నిద్ర పట్టకపోవడం
- శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడడం

### వ్యాధికి కారణాలు

- కాలుష్యం ప్రధాన కారణం
- వంశపారపర్యంగా వచ్చే అస్తమా
- ధూమపానం అధికం కావడం
- ఆస్పిరిన్, బీటా బ్లాకర్స్ వంటి మందుల వల్ల
- పారిశ్రామిక వాడల్లో వెదజల్లే రసాయనాల కాలుష్యం వల్ల

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- అలర్జీ కారకాలకు సాధ్యమైనంత దూరంగా ఉండాలి
- దుప్పట్లు, దిండు కవర్లు తరచూ వేడి నీటిలో శుభ్రంగా ఉతికి వాడుకోవాలి
- ధుమ్ము, ధూళి ఉన్న చోటికి వెళ్లకుండా ఉండడం మంచిది.
- ఇల్లు ఊడవడానికి బదులుగా తడి గుడ్డతో తుడవడం వల్ల దుమ్ము నుంచి ఉపశమనం కలుగుతుంది.
- పెంపుడు జంతువులకు సాధ్యమైనంత వరకు దూరంగా ఉండాలి.
- పుప్పొడి రేణువులు గాలిలో ఎక్కువగా ఉండే సీజన్లలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- శీతల పానీయాలు, ఐస్ క్రీంలు, ఫ్రిజ్ వాటర్‌కు వీలైనంత దూరంగా ఉండాలి.



### పెరిగిన మహిళా ప్రయాణికుల సంఖ్య

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకొచ్చాక నల్లగొండ రీజియన్‌లో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు ఖాళీ లేకుండా వెళ్తున్నాయి. బస్సు కెపాసిటీకి మించి ప్రయాణికులు వెళ్తున్నారు. ఈ పథకం అమల్లోకి రాక ముందు నల్లగొండ ఉమ్మడి జిల్లా రీజియన్ పరిధి 7 డిపోల్లో ప్రతి రోజూ 2 లక్షల మంది ప్రయాణిస్తే ప్రస్తుతం ఆ సంఖ్య 3లక్షలకు చేరింది. ఇందులో 2లక్షల మంది మహిళలే ఉండడం గమనార్హం. నల్లగొండ రీజియన్‌లో 7 డిపోలు ఉండగా వీటి పరిధిలో 637 బస్సులు ఉన్నాయి. వీటిలో ఆర్టీసీ 383, అద్దె బస్సులు 254 ఉన్నాయి.




# ఆర్టీసీ అద్దె బస్సుల సమ్మె సైరన్

## ఈ నెల 5 నుంచి చేసేందుకు సన్నద్ధం

- మహాలక్ష్మి పథకంతో బస్సుల్లో పెరిగిన ప్రయాణికుల సంఖ్య
- అధిక లోడ్‌తో మరమ్మతులకు గురవుతున్న బస్సులు
- బస్సుల నిర్వహణ భారం భరించలేమంటున్న యజమానులు
- తమ సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్
- ఉమ్మడి జిల్లాలో 7 డిపోల పరిధిలో 254 అద్దె బస్సులు
- సమ్మెతో సంక్రాంతి ప్రయాణాలకు ఇబ్బందే..

నల్లగొండ సిటీ, జనవరి 3 : తమ డిమాండ్లు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ అద్దె బస్సు యజమానులు సమ్మె సైరన్ మోగించారు. ఈ నెల 5నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు తెలిపారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో సమ్మెతో తీవ్ర సమస్యలు ఎదురయ్యే అవకాశముంది. ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించింది. దీంతో గతంలో కంటే మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అధిక లోడ్‌తో బస్సులు తరచూ రిపేరుకు గురవుతున్నాయని అద్దె బస్సుల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించాలని ఈ నెల 5 నుంచి సమ్మెబాట పడుతున్నారు. 14న సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రయాణికులకు ఇబ్బందులు కలగనున్నాయి. ఆర్టీసీ ఎండీతో పాటు ఆర్‌ఎంలకు సమ్మెపై నోటీసులు ఇచ్చినట్లు అద్దె బస్సుల యజమానులు తెలిపారు.

### సమస్యలు

- మహాలక్ష్మి పథకంతో గతంలో కంటే ప్రయాణికుల సంఖ్య భారీగా పెరగడంతో బస్సుల నిర్వహణ భారం మారింది.
- బస్సులో పరిమితికి మించి ప్రయాణికులు వెళ్లడంతో టైర్లు వేడెక్కి పేలే అవకాశముంది. కమాన్ కట్టలపై అధిక లోడు పడి అవి విరిగే అవకాశముంది.

### డిమాండ్లు

- బస్సులకు నూతన టైర్లు బల్క్ రేట్లకే అందించాలి.
- కేఎంపీఎల్‌ను తగ్గించి చార్జీలు ఇవ్వాలని సమ్మె నోటీసులు ఇచ్చారు

### డిమాండ్లు ప్రభుత్వ పరిధిలో ఉన్నాయి



తమ డిమాండ్లు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ అద్దె బస్సు యజమానులు ఈ నెల 5నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు నోటీసులు ఇచ్చారు. వారి సమస్యల పరిష్కారం తమ పరిధిలో లేదు. వారి డిమాండ్లు ప్రభుత్వ పరిధిలో ఉన్నాయి.

– శ్రీదేవి, ఆర్టీసీ ఆర్‌ఎం

### సమస్యలు పరిష్కరించాలి



మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో ప్రయాణికుల సంఖ్య పెద్ద సంఖ్యలో పెరిగింది. దీంతోఅద్దె బస్సులపై తీవ్ర ప్రభావం పడుతున్నది. బస్సుల నిర్వహణ భారం పెరిగిపోయాయి. దీంతో సమ్మెకు దిగుతున్నాం. దీనిపై ఇప్పటికే ఆర్టీసీ ఎండీతో పాటు ఆయా జిల్లాల్లోని ఆర్‌ఎంలకు సమ్మె నోటీసులు ఇచ్చాం.

– ధర్మేంద్ర, ఆర్టీసీ అద్దె బస్సుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు




# గృహలక్ష్మి ఎత్తేశారు

## గృహలక్ష్మి పథకాన్ని రద్దు చేసిన రాష్ట్ర సర్కారు

**జిల్లాలో 8,400 మంది దరఖాస్తు**

- ఇప్పటికే రూ.3లక్షల ఆర్థిక సాయం.. ప్రొసీడింగ్ ఆర్డర్ల అందజేత
- అనేక చోట్ల ఇంటి నిర్మాణ పనులు ప్రారంభం
- బంగారం కుదవబెట్టి వడ్డీలకు అప్పు తెచ్చిన వైనం
- ఇప్పుడు స్కీమ్ రద్దు చేయడంతో లబ్ధిదారుల ఆందోళన

యాదాద్రి భువనగిరి, జనవరి 3 (నమస్తే తెలంగాణ) : సొంత జాగా ఉండి ఇల్లు లేని నిరుపేదలకు నాటి కేసీఆర్ ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం కింద ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.3లక్షలు అందించాలని నిర్ణయించింది. ఇంటి మహిళ పేరుపై స్కీంను మంజూరు చేస్తారు. పథకం అమలుకు కలెక్టర్ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నారు.

**8,400 మందికి ప్రొసీడింగ్ కాపీలు**

గృహలక్ష్మి తొలి విడుతలో భాగంగా జిల్లాకు 8,400 యూనిట్లు మంజూరు చేశారు. నియోజకవర్గానికి 3వేల చొప్పున యూనిట్లు మంజూరయ్యాయి. ఇందుకోసం జిల్లాలో మొత్తం 34,750 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 24,291మందిని అర్హులను గుర్తించారు. దరఖాస్తుల ఆధారంగా తాసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు సిబ్బందితో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలనలు చేసి.. సమగ్ర జాబితా రూపొందించారు. పారదర్శకంగా పథకాన్ని అమలు చేస్తూ అర్హులను గుర్తించారు. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాలకు గాను ప్రతి అసెంబ్లీకి 3వేల మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. అదేవిధంగా సంస్థాన్ నారాయణపూర్, చౌటుప్పల్‌లో, మోత్కూరు, అడ్డగూడూరులో 750, రామన్నపేటలో 400మందిని ఎంపిక చేశారు. అనంతరం ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి.. ఎంపికైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందించారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 80శాతం కేటాయించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రూ.3లక్షల ఆర్థిక సాయాన్ని మూడు దశల్లో ఇస్తామని స్పష్టం చేశారు. ఇంటి బేస్‌మెంట్ స్థాయిలో రూ.లక్ష, పైకప్పు దశలో రూ.లక్ష, నిర్మాణం పూర్తయ్యాక రూ. లక్ష చెల్లిస్తామని తెలిపారు.

### బంగారం కుదవెట్టి.. అప్పులు తెచ్చి

గృహలక్ష్మి పథకం మంజూరు ఉత్తర్వు పత్రాలు ఇవ్వడంతో లబ్ధిదారులు ఎంతో సంబురపడ్డారు. తాము కొంత డబ్బులు ఖర్చు పెడితే, ప్రభుత్వం మరో రూ.3లక్షలు ఇస్తుండటంతో అనేక చోట్ల ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు. డబ్బులు చేతిలో లేకున్నా బంగారం కుదవబెట్టి, బయట వడ్డీలకు అప్పులు తెచ్చారు. పనులు చకచకా కొనసాగించారు. తీరా ప్రస్తుతం ప్రభుత్వం పథకాన్ని రద్దు చేయడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కొనసాగుతున్న పథకాన్ని మధ్యలో రద్దు చేయడమేమిటని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సాయం చేస్తుందనే తాము పనులు ప్రారంభించామని, ఇప్పుడు మొత్తం ఇంటి నిర్మాణం కట్టాలని మండిపడుతున్నారు.

### రాష్ట్రంలో తొలి ప్రొసీడింగ్ మన దగ్గరే

గృహలక్ష్మి పథకం తొలుత మన దగ్గరే అమలైంది. తొలి లబ్ధిదారుగా భూదాన్‌పోచంపల్లి మండలంలోని కనుముకులకు చెందిన చుక్కా పావని అనే చేనేత కార్మికురాలు నిలిచింది. ఆగస్టు 12న పోచంపల్లికి వచ్చిన అప్పటి మంత్రి కేటీఆర్‌కి తమకు ఇల్లు లేదని, ఆశ్రయం కల్పించాలని పావని విజ్ఞప్తి చేసింది. గృహలక్ష్మి పథకాన్ని ఆమెకు వెంటనే వర్తింపజేయాలని కేటీఆర్ ఆదేశించారు. దీంతో ఆ మరుసటి రోజే నాటి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, అప్పటి కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి స్వయంగా పావని ఇంటికెళ్లి రూ.3లక్షల ప్రొసీడింగ్ ఆర్డర్ అందించారు.

# మహిళా రథసారథులు

- నల్లగొండ నూతన కలెక్టర్‌గా హరిచందన
- ఇప్పటికే ఎస్పీగా చందనా దీప్తి బాధ్యతల స్వీకరణ
- జిల్లాలో తొలిసారిగా ఇద్దరూ మహిళా బాసులే



నల్లగొండ కలెక్టర్ హరిచందన



ఎస్పీ చందనా దీప్తి

నల్లగొండ ప్రతినిధి, జనవరి 3 (నమస్తే తెలంగాణ) : నల్లగొండ జిల్లా నూతన కలెక్టర్‌గా 2010 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన దాసరి హరిచందన నియామకమయ్యారు. రాష్ట్రంలోని పలువురు ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ బుధవారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నల్లగొండ కలెక్టర్‌గా రానున్న దాసరి హరిచందన ఇప్పటివరకు ఆయూష్ కమిషనర్ బాధ్యతలతోపాటు డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. కాగా ఈ నెల 1వ తేదీన జిల్లా ఎస్పీగా చందనా దీప్తి బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. తాజాగా కలెక్టర్‌గా హరిచందన నియామకంతో జిల్లా చరిత్రలో తొలిసారిగా ఇద్దరూ మహిళా రథసారథులు కావడం విశేషం. వాస్తవంగా గత నెల 17న జిల్లా కలెక్టర్‌గా పని చేస్తున్న ఆర్‌వీ కర్ణన్(2012)ను ప్రభుత్వం బదిలీ చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న హేమంత్ కేశవ్ పాటిల్(2019) ఇన్‌చార్జి కలెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. హేమంత్ కేశవ్ పాటిల్ నుంచి గురువారం జిల్లా నూతన కలెక్టర్‌గా హరిచందన బాధ్యతలు చేపట్టనున్నారు. హైదరాబాద్‌కు చెందిన హరిచందన తండ్రి దాసరి శ్రీనివాసరావు కూడా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో పర్యావరణ అర్థశాస్త్రంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన హరిచందన అక్కడే ఉన్నత ఉద్యోగంలో చేరారు. ఐఏఎస్ అయిన తన తండ్రి శ్రీనివాసరావు స్ఫూర్తితో తను కూడా సివిల్స్ వైపు దృష్టి సారించి లండన్‌లో ఉన్నత ఉద్యోగాన్ని వదులుకొని ఇండియాకు వచ్చేశారు. సివిల్స్ ప్రిపరేషన్‌లో భాగంగా తొలి ప్రయత్నంలోనే ఐఆర్‌ఎస్ సాధించారు. ఐఏఎస్ లక్ష్యంతో 2010లో రెండో అటెంప్ట్‌లో తన లక్ష్యాన్ని సాధించారు. ఐఏఎస్‌కు ఎంపికయ్యాక విశాఖపట్నం అసిస్టెంట్ కలెక్టర్‌గా, తర్వాత విజయవాడ సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్‌గా, నారాయణపేట జిల్లా కలెక్టర్‌గానూ పనిచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ సర్కార్ వచ్చాక కొత్తగా చేపట్టిన ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న హరిచందన నల్లగొండ జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఇదే సమయంలో ఆర్‌వీ కర్ణన్‌కు కూడా తాజా బదిలీల్లో తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ)ఎండీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పజెప్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# శరవేగంగా విద్యుత్ సబ్ స్టేషన్ పనులు

- శేరిల్లా గ్రామ పరిధిలో సబ్‌స్టేషన్ నిర్మాణం
- కేసీఆర్ ప్రభుత్వంలో రూ.1.60 కోట్లు కేటాయింపు
- త్వరలోనే లోఓల్టేజీ సమస్యకు చెక్

చౌటుప్పల్ రూరల్, జనవరి 3 : చౌటుప్పల్ మండలంలోని శేరిల్లా గ్రామ పరిధిలో ఏర్పాటు చేస్తున్న 33/11కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. మండలంలోని పెదకొండూరు, మసీదుగూడెం, శేరిల్లా గ్రామాల పరిధిలో లోఓల్టేజీ సమస్య పరిష్కారం కోసం గత కేసీఆర్ ప్రభుత్వం సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.1.60 కోట్లు మంజూరు చేసింది. దీని నిర్మాణం పూర్తయితే లోఓల్టేజీ సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారం కానున్నది.

### 60 శాతం పనులు పూర్తి

మండలంలోని పలు గ్రామాల్లో లోఓల్టేజీ సమస్యతో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. లోఓల్టేజీ సమస్యతో తరచూ బోరుబావుల మోటర్లు కాలిపోతుండటంతో స్థానిక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మోటర్ల రిపేరింగ్‌కు అధిక పెట్టుబడి పెట్టాల్సి వస్తుందని, మోటరు రిపేరు అయ్యే సరికి నీరందక కొంత పంట ఎండిపోతుందని రైతులు వాపోతున్నారు. రైతుల సమస్యను తీర్చేందుకు శేరిల్లా గ్రామంలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి అప్పటి కేసీఆర్ ప్రభుత్వం రూ.1.60 కోట్లు మంజూరు చేసింది. గతేడాది ఆగస్టు 11న అప్పటి ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. వెంటనే టెండర్ పిలిపించి పనులు ప్రారంభింపజేశారు. అప్పటి ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి పనులు వేగంగా సాగేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. దాంతో ఇప్పటికే పనులు ఇప్పటికే 60శాతం పూర్తయ్యాయి. మరికొద్ది రోజుల్లో పనులు పూర్తి కానున్నాయి. సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయితే లోఓల్టేజీ సమస్య నుంచి విముక్తి లభించనుండడంతో ఆయా గ్రామాల ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



శేరిల్లా గ్రామ పరిధిలో ఏర్పాట్లు చేస్తున్న 33/11కేవీ సబ్‌స్టేషన్

### సబ్‌స్టేషన్ పూర్తయితే సమస్య తీరుతుంది



మా గ్రామంలో లోఓల్టేజీ సమస్య తీవ్రంగా ఉంది. దాంతో మోటర్లు సరిగా నడవడం లేదు. తరచూ కాలిపోతుండడంతో ఇబ్బందులు పడుతున్నం. గత ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి చొరవతోనే మా సమస్యకు పరిష్కారం లభించింది. సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు కూడా వేగంగా జరుగుతున్నయ్. మరి కొద్ది రోజుల్లో పనులు పూర్తయ్యేలా ఉన్నయ్. సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయితే లోఓల్టేజీ సమస్య తీరుతుంది.

–పిశాటి సుదర్శన్‌రెడ్డి, రైతు, మసీదుగూడెం